RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 173 | జూన్ 4, 2025 | వెల : రూ.3-00



ఉద్యమాల 'కృష్ణ'కు పద్మశ్రీ

4లో..



# 'భూభారతి'తో రైతుకు భద్రత

- వచ్చే ఆగస్టు నాటికి 'ధరణి' నుంచి విముక్తి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**వేద న్యూస్, ఖమ్మం :**

దేశానికి ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చిన విధంగానే వచ్చే ఆగస్టు నాటికి ధరణి నుంచి పూర్తిగా రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించి భూ భారతి చట్టం ద్వారా ప్రతీ రైతుకు భద్రత కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అసైన్డ్ కమిటీలు వేసి భూములను ప్రజా వసరాల కోసం వినియోగిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. నాట్లు పడకముందే రైతు భరోసా నగదు జమ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో మంగళవారం భూభారతి సదస్సు నిర్వ హించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవె న్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూభారతి చట్టంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ములుగుమాడులో చేపట్టిన భూముల రీసర్వేను లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో చేపట్టబోయే భూముల రీసర్వే ప్రక్రియను మంత్రులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రులు మాట్లాడారు. రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అధికారులే వచ్చి పరిష్కరిస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలోని 413 గ్రామాల్లో నక్షాలు లేవని, అందుకే రాష్ట్రంలో ఎంపిక చేసిన 5 గ్రామాల్లో భూముల రీ సర్వే చేపట్టినట్లు వివరించారు. ఈ గ్రామాల్లో 20 రోజుల పాటు సర్వే నిర్వహించి నక్షాలు తయారుచేయడమే కాకుండా రైతులు, కమతాల వారీగా నక్షా అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూమి లేకుండా ఉన్నట్లు చిత్రీకరించి లక్షల ఎకరాలకు రైతుబంధు పొందారని ఆరోపించారు. ధరణి పేరుతో అక్రమంగా కట్టబెట్టిన భూముల లెక్కలు తీస్తున్నామన్నారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు నాలుగు సార్లు భూ సంస్కరణ చట్టాలు వస్తే కాంగ్రెస్ తెచ్చిన మూడు చట్టాలతో ప్రజలకు న్యాయం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత సర్కార్ తెచ్చిన ధరణి చట్టంతోనే తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. భూమిలేని పేదలకు సాగుభూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చే ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోని అసైన్డ్ కమిటీలను భూభారతి చట్టంతో తిరిగి ప్రారంభిస్తామని భట్టి తెలిపారు. భూసమస్యల పరిష్కార ప్రక్రియను ప్రారంభించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.



# అరవింద్‌కు వాటా ఇప్పిస్తాం..

- మిట్టపెల్లి వారసుడికి ముదిరాజ్ కుల పెద్దల హామీ.. ధర్నా విరమణ

వేద న్యూస్ EFFECT

**వేద న్యూస్, వరంగల్:**

'వారసుడి న్యాయపోరాటం', 'న్యాయపోరాటానికి పెరుగుతున్న మద్దతు' శీర్షికలతో "వేద న్యూస్" తెలుగు దినపత్రిక ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనాలకు స్పందన వచ్చింది. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఎలుకుర్తి(హవేలి)లో తన తండ్రి ఆస్తిలో వాటా కోసం తనయుడు ధర్నా చేస్తున్న సంగతి తెలిసిందే. తల్లితో కలిసి ఊరిలో టెంట్ వేసుకుని తండ్రి ఫొటోతో నిరసన తెలుపుతున్నాడు. వివరాల్లోకెళితే.. ఎలుకుర్తి గ్రామవా స్తవ్యు లు మిట్టపల్లి రాజేశ్వర్‌కి ముగ్గురు కుమారులు.. పెద్ద కుమారుడు కరుణాకర్, రెండో కుమారుడు శ్రీనివాస్, మూడో కుమారుడు రాజు. కాగా, 17 ఏళ్ల క్రితం మిట్టపల్లి శ్రీనివాస్ చనిపోయారు. తన కుమారుడైన మిట్టపల్లి అర విండ్.. తన తల్లి స్వరూపతో కలిసి తమకు రావలసిన ఆస్తి కోసం ధర్నా చేస్తున్నాడు. గ్రామపంచాయతీ ఆఫీసు ఎదుట అరవింద్ చేస్తున్న ధర్నా మంగ ళవారానికి (9వరోజుకు) చేరింది. అరవింద్ న్యాయపోరాటానికి విజిలెన్స్ కమిటీ మెంబర్ నమిండ్ల చిన్నస్వామి, భీమగాని సౌజన్య మద్దతు తెలిపారు. తాజాగా ముదిరాజ్ కులసంఘం పెద్దలు అరవింద్‌కు అండగా నిలిచారు.



న్యాయపోరాటానికి పెరుగుతున్న మద్దతు..!

- కదిలిన ప్రజాసంఘాలు
- ఎనిమిదో రోజుకు మిట్టపెల్లి వారసుడి ధర్నా
- వరంగల్ జిల్లా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దళితరత్న నమిండ్ల చిన్నస్వామి మద్దతు
- వారసత్వంగా అరవింద్‌కు రావాల్సిన వాటా ఆస్తిని ఇవ్వాల్సిందేనని డిమాండ్

వేద న్యూస్, వరంగల్:

'వారసుడి న్యాయపోరాటం' శీర్షికన "వేద న్యూస్" తెలుగు దినపత్రిక ప్రధాన సంచికలో ఈ నెల 1న ప్రచురితమైన కథనానికి ప్రజాసంఘాలు స్పందించాయి. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఎలుకుర్తి(హవేలి)లో తన తండ్రి ఆస్తిలో వాటా కోసం తనయుడు ధర్నా చేస్తున్నాడు. తల్లితో కలిసి ఊరిలో టెంట్ వేసుకుని తండ్రి ఫొటోతో నిరసన తెలుపుతున్నాడు. వివరాల్లోకెళితే.. ఎలుకుర్తి గ్రామవాస్తవ్యులు మిట్టపల్లి రాజేశ్వర్‌కి ముగ్గురు కుమారులు.. పెద్ద కుమారుడు కరుణాకర్, రెండో కుమారుడు శ్రీనివాస్, మూడో కుమారుడు రాజు. కాగా, 17 ఏళ్ల క్రితం మిట్టపల్లి శ్రీనివాస్ చనిపోయారు. తన కుమారుడైన మిట్టపల్లి అరవింద్.. తన తల్లి స్వరూపతో కలిసి తమకు రావలసిన ఆస్తి కోసం ధర్నా చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వరంగల్ జిల్లా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ మెంబర్ నమిండ్ల చిన్నస్వామి సోమవారం ఆ గ్రామానికి వెళ్లారు. అరవింద్ చేస్తున్న ధర్నాకు మద్దతు తెలిపారు. వాటా ప్రకారం అరవింద్‌కు రావాల్సిన ఆస్తిని ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు.

మిట్టపల్లి అరవింద్‌కు రావలసిన ఆస్తి మూడెకరాల విషయమై.. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినా అరవింద్ పెదనాన్న, బాబాయ్‌లు అంగీకరించడం లేదని చెప్పారు. పోలీస్ స్టేషన్ కు వెళ్లినా వారు స్పందించడం లేదని చెప్పారు. వారి తీరు ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున దళిత సంఘాల నాయకులమంతా ఏకమై.. వారికి న్యాయం జరిగే వరకూ వారి వెంటే ఉంటామని స్పష్టం చేశారు. అరవింద్‌కు న్యాయం జరిగే వరకూ వారికి అండగా ఉంటామని చెప్పారు. భీమగాని సౌజన్య కూడా అరవింద్ న్యాయపోరాటానికి మద్దతు తెలిపారు. త్వరలో పరిష్కార మార్గాన్ని చూపుతామని హామీ ఇచ్చారు.

తండ్రి వారసత్వంగా అరవింద్‌కు రావాల్సిన ఆస్తిని వాటా ప్రకారం ఇప్పిస్తామని ముదిరాజ్ కుల పెద్దలు హామీ ఇవ్వడంతో..అరవింద్ ధర్నా విరమించారు. అనంతరం కుల సంఘం పెద్దలు పెద్ద సంఖ్యలో మిట్టపల్లి అరవింద్ నానమ్మ ఇంటికి తీసుకెళ్లారు. తాళం వేసి ఉన్న ఇంటిని పగులగొట్టి అందులో ఉండాలని సూచించారు. కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, ముదిరాజ్ కుల సంఘం పెద్ద మనిషి బోయిన శ్రీను, బుసాని రఘు, బోయిన రాములు, దమ్మన్నపేట ముదిరాజ్ కుల సంఘం పెద్దలు పి.నాగరాజు, రాజేందర్, బాలయ్య, కట్టమల్లు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దుబాసి నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# సే నో టూ ప్లాస్టిక్

- పీసీబీ పోస్టరు విడుదల
- ఈ మహత్తర ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యవ్వాలని మంత్రి కొండా సురేఖ పిలుపు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని.. పర్యావరణాన్ని నష్టప రచొద్దని మంత్రి చెప్పారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) పోస్టరును మంగ ళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2025 సందర్భంగా "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్‌తో పోస్టర్‌లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడు తూ ఈ పోస్టర్లు పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. స్థిర మైన పద్ధతులను అవలంభించడం, సరైన వ్యర్థాల నిర్వహణ అవసరాన్ని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని, వ్యక్తులు పాల్గొనేలా ప్రోత్సహించి ప్లాస్టిక్ కాలుష్యానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ సూచించారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో టీజీ పీసీబీ మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి, అధికారులు పాల్గొన్నారు.

# చోరీలపై ఫోకస్ పెట్టాలి:సీపీ

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**




పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీల నియంత్రణపై ప్రతి పోలీస్ అధికారి నజర్ పెట్టాలని వరం గల్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చా రు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని మంగళవా రం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. పెండింగ్ చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సో మ్ము రికవరీ, పెండింగ్ లో వున్న చోరీ కేసులు, నిందితుల అరెస్ట్ పై సీపీ సమీక్ష జరపడం తో పాటు, సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న ఇతర కేసులపై సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పో లీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరి ష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిష నర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియం త్రణకై సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలను భాగస్వాములను చేయడంతో సిసి కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగహన కల్పించాలని అన్నారు. నేరాలకు సంబంధించి అధికారులు దర్యాప్తు సమయం లో టెక్నాలజీ తో పాటు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేపట్టాలని సీపీ తెలియజేసారు. రాబోవు బక్రీద్ పండుగను దృష్టి లో పెట్టుకొని మూగజీవాల రవాణా పై ప్రత్యేక దృష్టి పెట్టడం పాటు, పండుగ వేళ దర్గాల వద్ద పతిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని.వరంగల్ కు వున్న కీర్తి ప్రతిష్టలకు తగ్గట్లుగా పోలీసింగ్ వుండాలి. ప్రతి పోలీస్ బేసిక్ పోలీసింగ్ పై దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా,రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగాం ఏఎస్పీ చైతన్య, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**వేద న్యూస్, వరంగల్ :**




వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటి ష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, మార్కెటింగ్ శాఖ సంచాలకు లు, సహకార శాఖ రిజిస్ట్రార్ కె. సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ ప్రభాకర్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నియం త్రణపై సమీక్షించి సమర్థ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేం దుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరు వైకల్యం బారిన పడకుండా ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఒకే ప్రాంతంలో ఐదు ప్రమాదాలు జరిగితే ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్లుగా గుర్తించి ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు నివారించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాల రవాణా శాఖ అధికారులు పురుషోత్తం, శోభన్ బాబు, జిల్లా ఆర్ అండ్ బి అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎన్హెచ్ఎఐ టీం లీడర్ సంపత్ సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## రైతుల సమస్యలు పరిష్కరించేందుకు
# భూ భారతి రెవెన్యూ సదస్సులు

- ఆర్డిఓ నారాయణ

**వేద న్యూస్, శాయంపేట:**

రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని ఆర్డిఓ నారాయణ అన్నారు. శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సదస్సులో రైతుల నుండి మొత్తం 153 దరఖాస్తులు భూ సమస్యలపై వచ్చిన వాటిని తీసుకొని వారికి రిసిప్ట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో నారాయణ మాట్లాడుతూ రైతుల దగ్గరికి రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వం పంపి భూ సమస్యలు పరిష్కరించేలా చేస్తుంది అన్నారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సులో తహసిల్దార్ సత్యనారాయణ, డిటి ప్రభావతి, ఆర్ ఐ లు డి రమేష్, ఎం రమేష్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమం పై సమావేశం

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం పైన కమలాపూర్ మండల పరిధిలోని అన్ని విభాగాలకు సంబంధించిన వారితో సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా సమావేశాన్నుద్దేశించి కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం ద్వారా ప్రతి పాఠశాలలో 20 నుంచి 25 శాతం వరకు విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూసుకోవాలని ఆ విధంగా తగిన కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం కమలాపూర్ మండల విద్యాశాఖ అధికారి కే శ్రీధర్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం కొరకు విలేజ్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రులతో తరచుగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ బడిబాట కార్యక్రమం జూన్ 6వ తేదీ నుండి తొమ్మిదవ తేదీ వరకు జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన విధంగా రోజువారీ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. 2025 26 సంవత్సరానికి గాను పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగిందని అతి త్వరలోనే విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్స్ కూడా పాఠశాలలకు చేరుతాయని వాటిని పాఠశాల ప్రారంభమయ్యే మొదటి రోజున విద్యార్థులందరికీ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకెపి సభ్యులు, విలేజ్ ఆర్గనైజర్స్, విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్స్, అంగన్వాడీ టీచర్లు, హాస్టల్ వార్డెన్లు, పంచాయతీ సెక్రటరీలు, మండల రెవెన్యూ అధికారి, ఐకెపి ఎపిఓ, అంగన్వాడి సూపర్వైజర్లు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# మట్టి పరీక్ష..రైతుకు మార్గం చూపుతుంది

**వేద న్యూస్, శాయంపేట:**



– మండల వ్యవసాయ అధికారి గంగా జమున.

శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో, రైతులతో మట్టి నమూనాలు తీసే విధానము మట్టి పరీక్షల వల్ల కలిగే ఉపయోగాల గురించి మండల వ్యవసాయ అధికారి గంగాజమున వివరించడం జరిగింది.రైతులకు పంటలు పండించడానికి మట్టి పరీక్షల వల్ల కలిగే ఉపయో గాలు చాలా ముఖ్యమైనవి. ఇవి పంట ఉత్పత్తిని మెరుగుపరచడంలో, వ్యయాన్ని తగ్గించడంలో,భూమి ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి అన్నారు.మట్టి పరీక్షల వల్ల రైతుకు ఉపయోగాలు చాలా ఉన్నాయి.మట్టిలో ఉన్న పోషకాలు, పి హెచ్ స్థాయిని బట్టి ఏ పంటలకు భూమి అనుకూలంగా ఉంటుందో తెలుసుకోవచ్చు అని అన్నారు.దీంతో రైతు అనవసరంగా నష్టపోయే అవకాశం తగ్గుతుంది అని తెలిపారు.మట్టిలో ఏ పోషకాలు లోపంగా ఉన్నాయో తెలుసుకుని సరైన ఎరువులు, సరైన మోతాదులో వాడుకోవచ్చు అలాగే ఎక్కువ ఎరువులు వేసి వృథా చేసే ఖర్చు తగ్గుతుంది అన్నారు.మట్టి పరీక్ష ద్వారా మట్టిలో ఆమ్లత (పి హెచ్), క్షారత వంటి లక్షణాలు తెలుస్తాయి అన్నారు.వీటిని సమతుల్యం చేయడం వల్ల భవిష్యత్‌లో భూమి ఫలదాయకత తగ్గిపోకుండా కాపాడుకోవచ్చు.మట్టికి అవసరమైన పోష కాల సమతుల్యాన్ని కల్పించడం వల్ల పంటల ఆరోగ్యం బాగుండి, దిగుబడి పెరుగుతుంది.సరైన సమయంలో, సరైన మోతాదులో ఎరువులు వేయడం వల్ల నీరు, ఎరువుల వినియోగం సమర్థవంతంగా ఉంటుంది.మట్టికి అవసరం లేని ఎరువులు వేసే తప్పు నివారించబడి, రైతు ఖర్చులు తగ్గుతాయి.ఎక్కువగా రసాయన ఎరువులు వాడకుండా ఉండడం వల్ల నేల, నీటి కాలుష్యం తగ్గుతుంది అన్నారు.

దీంతో రైతు భూమిని మెరుగ్గా వినియోగి ంచుకొని ఎక్కువ దిగుబడితో ఆదాయం పెంచుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలీ రేటర్ లు గౌస్, భానుమతి ,రవిచందర్, తిరుపతి,వంశీ ,హనీఫా రైతులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లమెంటరీ ఫలితాలు వచ్చేస్తున్నాయ్..!

**వేద న్యూస్, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు 2025 మే 12 నుంచి మే 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలు రాసిన వేలాది మంది విద్యార్థులు ప్రస్తుతం ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీళ్ల నిరీక్షణకు త్వరలో తెరపడనుంది. తాజాగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. అదేంటంటే.. జూన్ మొదటి వారంలో ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ రిజల్ట్స్ 2025 విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈఏపీసెట్, నీట్, జేఈఈ వంటి కీలక ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రారంభంకానున్న నేపథ్యంలో వీలైనంత త్వరలోనే ఫలితాలను వెల్లడించాని అధికారులు భావిస్తున్నారు. జూన్ 8 నుంచి 10వ తేదీలోపు ఫలితాలు విడుదల ఎప్పుడైనా విడుదల చేసే అవకాశం ఉంది. కాగా ఆంధ్రప్రదేశ్‌లో మే 12వ తేదీ నుంచి మే 20వ తేదీ వరకు జరిగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇంటర్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులతోపాటు ఆయా సబ్జెక్టుల స్కోర్‌లను మెరుగుపరచు కోవాలనుకున్న విద్యార్థులు (ఇంప్రూవ్‌మెంట్) సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలైన తర్వాత అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

## బీసీ,ఎస్సీ,ఎస్టీల రాజ్యాధికారమే

# ధర్మసమాజ్ పార్టీ లక్ష్యం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



బీసీ,ఎస్సీ,ఎస్టీల రాజ్యాధికారమే మా ధర్మసమాజ్ పార్టీ లక్ష్యం అని డీఎస్పీ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జి తరి ఎల్లయ్య అన్నారు.బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డా. విశారదన్ మహరాజ్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపానికి తెలంగాణ బీసీ,ఎస్సీ, ఎస్టీల అమరవీరుల స్తూపం గా నామకరణం చేసినట్ల తరి ఎల్లయ్య పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం లో బలై పోయిన అమరవీరులంతా 99శాతం బీసీ,ఎస్సీ,ఎస్టీ పేద ప్రజలే అని,అధికారంలోకి వచ్చిందంత అగ్రకుల దొరలేనని,అమృతం అగ్రవర్ణాలు తీసుకొని విషం బీసీ,ఎస్సీ,ఎస్టీ లకు ఇచ్చారని ఆరోపించారు. బీసీ,ఎస్సీ,ఎస్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా మా పోరాటం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు వజ్రగిరి అంజయ్య,ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు రాజశేఖర్,వెంకటేష్,దామరచర్ల మండల అధ్యక్షులు సైదులు,మిర్యాలగూడ మండల అధ్యక్షులు నవీన్,మిర్యాలగూడ పట్టణ ఇన్చార్జ్ కళ్యాణ్, వేములపల్లి మండల అధ్యక్షులు శివన్,బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు బంటు నాగయ్య గౌడ్,శివ నాయక్,సైదా నాయక్, మల్లికార్జున్, అరుణ్, మహేష్,రామ్ తదితరులు పాల్గొన్నారు.

# బావుపేటలో ‘భూభారతి’పై సదస్సు



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల పరిధిలోని బావుపేట గ్రామంలో మంగళవారం ‘భూభారతి’పై అవగాహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ జగత్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, ఆరెపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మాటూరు సుదర్శన్, అంబేద్కర్ సంఘం ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు అంబాల ఆర్య రాజ్, బందెల రమేశ్, తాడూరి సదానందం, నన్నే బోయిన రమేష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శనిగరపు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర రైతులు ధరణితో అనేక రకమైన సమస్యలతో జీవన్మరణ సమస్యలను ఎదుర్కొన్నారని చెప్పారు. కొత్త రెవెన్యూ చట్టం రైతులకు చుట్టంగా ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులతో రైతులకు ఉన్న భూసమస్యల పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రెవెన్యూ సదస్సును తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల భూ సమస్యల కోసం భూభారతి నీ ఏర్పాటుచేసిన విషయం అందరికీ తెలిసిందే.ఈ యొక్క భూభారతిపై అందరికీ అవగాహన రావాలని ప్రతి గ్రామంలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మిర్యాలగూడ మండల పరిధిలోని తుంగపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సును మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తనిఖీ చేయడం జరిగింది.

## మహిళా నిరసనకారుల

# అరెస్టుకు కొత్త ‘స్విఫ్ట్’ టీం!

**వేద న్యూస్, హైదరాబాద్ :**



హైదరాబాద్ నగరంలో తరచూ జరిగే ధర్నాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాల్లో మహిళా ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవడం పోలీసులకు సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో, మహిళా నిరసనకారులను సమర్థవంతంగా అరెస్టు చేసేందుకు ప్రత్యేకంగా 35 మంది మహిళా కానిస్టేబుళ్లతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# జర్నలిస్టులకు వన్‌డే క్లాసెస్

– స్కిల్స్ ఇంప్రూవ్‌మెంట్ కోసం.. – ఆసక్తి ఉన్న పాత్రికేయులందరూ ఆహ్వానితులే: కోఆర్డినేటర్స్

**వేద న్యూస్, కాశీబుగ్గ :**

వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు ఒక్కరోజు జర్నలిజం శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్టు శిక్షణా శిబిరం కో-ఆర్డినేటర్స్ సీనియర్ జర్నలిస్టులు జక్కుల విజయ్ కుమార్, రాజేందర్ దామెర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జర్నలిజంలో అనుభవం కలిగిన సీనియర్ అధ్యాపకులతో వార్తాకథనాలుపై క్లాసెస్ ఉంటాయని వెల్లడించారు. వార్తలు, స్టోరీలు, వార్తాసేకరణ, శీర్షికలు, లీడ్, సూపర్ లీడ్, వాక్యనిర్మాణం తదితర అంశాలపై ఈ క్లాసులో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. నూతనంగా జర్నలిజంలో వచ్చే వారు, ఇప్పటికే కొనసాగుతున్నావారు, గ్రామీణ, పట్టణ విలేకరులు.. ఆసక్తి ఉన్నవారందరూ ఈ క్లాసెస్‌కు ఆహ్వానితులే అని పేర్కొన్నారు. ఈ క్లాసులు (జూన్ 4) బుధవారం ఉదయం 10 :30 గంటలకు.. స్కాలర్స్ పబ్లిక్ స్కూల్ కాశీబుగ్గ తిలక్ రోడ్డు, వరంగల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వెంటనే 94930 87222, 9849565531 నంబర్లను సంప్రదించొచ్చని స్పష్టం చేశారు.

# క్షమాపణలు చెప్పని కమల్ హాసన్

**వేద న్యూస్, డెస్క్:**

కమల్ హాసన్ నటించిన ‘థగ్ లైఫ్’ చిత్రం ప్రస్తుతానికి కర్ణాటకలో విడుదల కావడం లేదని ఆయన తరఫు న్యాయవాది మంగళవారం కర్ణాటక హైకోర్టుకు తెలియజేశారు. ‘థగ్ లైఫ్’ సినిమా ప్రచార కార్యక్రమంలో కన్నడ భాషపై కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. థగ్ లైఫ్ ఈ నెల 5న విడుదల కానున్న నేపథ్యంలో, సినిమాను కర్ణాటకలో నిషేధించాలంటూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది.మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, కమల్ హాసన్ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. క్షమాపణ చెప్పి ఉంటే ఈ వివాదం ఇంత దూరం వచ్చేది కాదని అభిప్రాయపడింది. విచారణ అనంతరం, కమల్ హాసన్ కేఎఫ్‌సీసీకి ఒక లేఖ రాశారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని అందులో పేర్కొన్నారు. అయితే, ఆ లేఖలో ఎక్కడా క్షమాపణ చెప్పకపోవడం గమనార్హం. మరోసారి పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు, కమల్ రాసిన లేఖను ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు సమర్పించారు. దీనిపై జస్టిస్ నాగప్రసన్న స్పందిస్తూ, కమల్ ఇచ్చిన వివరణ బాగానే ఉన్నా, అందులో ఒక ముఖ్యమైన వాక్యం లోపించిందని వ్యాఖ్యానించారు. కమల్ వ్యాఖ్యల్లో ఎలాంటి దురుద్దేశం లేదని, ఆయన ఒక వ్యక్తిని ఉద్దేశించి మాత్రమే మాట్లాడారని, కన్నడ భాషను కించపరిచే ఉద్దేశం లేదని కమల్ తరఫు న్యాయవాది వాదించారు. అలాంటప్పుడు క్షమాపణ చెప్పి వివాదాన్ని ముగించవచ్చు కదా అని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనికి కమల్ న్యాయవాది బదులిస్తూ, “కమల్ హాసన్ తాను చెప్పాలనుకున్నది స్పష్టంగా చెప్పారు. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే, కర్ణాటకలో తన సినిమాను విడుదల చేయరు” అని కోర్టుకు విన్నవించారు. మరోవైపు, కేఎఫ్‌సీసీతో సంప్రదింపులు జరిపేందుకు కొంత సమయం కావాలని నిర్మాత తరఫు న్యాయవాది కోరారు.

# సంపాదకీయం

## మేఘా పై నిషేధమా?


పేరుకు తగ్గట్టుగానే మేఘా అమెరికా గడ్డమీద ఘర్జించింది. ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని, అందుకు సహాయపడుతున్న అమెరికా విద్యాలయాల పరిశోధనలను ప్రశ్నించింది. కేవలం మాటలతోనే కాదు, రూపంతో కూడా పాలస్తీనాకు సంఘీభావంగా నిలిచింది. పాలస్తీనా అంతటా కమ్ముకున్న కారుమబ్బులను చీలుస్తూ మేఘా ఎం. వేమూరి మాటలు తూటాల్లా తాకాల్సిన వారికి తాకాయి. ఇప్పుడు ఆ ధిక్కార స్వరం ప్రపంచమంతటా ప్రతి ధ్వనిస్తోంది. ఆమె స్వరాన్ని ఆందులోని నిజాన్ని కోట్లాది నెటిజన్లు వింటూ, తమ మిత్రులకు చేరవేస్తున్నారు. పాలస్తీనాలో కోల్పోతున్న పసిపిల్లల ప్రాణాలు చూసినప్పుడు మానవతవాదులు ఎంతగా ఘోషించారో, మేఘా గొంతు విన్నప్పుడు అంతగా పులకించారు. పాలస్తీనా కోసం తన వ్యక్తిగత భవిష్యత్తును ఫణంగా పెట్టిన నవ యవ్వన విజ్ఞాన వేత్త, వీరవనిత మేఘా ఎం. వేమూరి. ఆమె మూలాలు మన తెలుగు గడ్డపై వున్నందుకు గర్విద్దాం, ఆమె ధైర్యానికి జేజేలు పలుకుదాం. 'మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మా జీవితంలో ముందుకు సాగడానికి సిద్ధమవుతుంటే, గాజా లో విశ్వవిద్యాలయాలు లేకుండా పోయాయి' అని అమెరికా, పాలస్తీనా విద్యావ్యవస్థల ద్వంద్వ స్వభావాన్ని ఒక్క వాఖ్యంలో మేఘా ప్రపంచానికి చాటారు. క్రమంగా కోల్పోతున్న ప్రపంచ ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి అమెరికా అధ్యక్షుడు బరితెగిస్తూ విపరీత చర్యలు ప్రకటిస్తుంటే, అదే గడ్డపై నిలిచి అమెరికా విద్యాలయాల పరిశోధనలు ఇజ్రాయిల్ హింసోన్మాదానికి ఎలా సహకరిస్తున్నాయో బద్ధలు కొట్టినట్లు మాట్లాడడం చిన్న విషయం కాదు. 56 ఇంచుల ఛాతి వుందని చెప్పుకునే అతిపెద్ద పాలకులే ట్రంపు నోటికి ఎదురు మాట్లాడలేక మౌనంగా తలదాచుకుంటుంటే మదించిన గజాన్ని అంకుశంలా నియంత్రించడానికి మేఘా ప్రయత్నించింది. ఇది యువతలో పెరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేకత కు ఒక ప్రతిరూపం. తాను మాట్లాడేది ఏమిటో, ఆ తర్వాత ఏమి జరుగుతుందో, తన భవిష్యత్ ఎలాంటి ప్రమాదంలో పడుతుందో స్పష్టంగా తెలిసి మాట్లాడడం వెనుక ఆమెలో, ఆమెలాంటి అనేక మంది యువతలో, విద్యాలయాల్లో మెదలుతున్న ఆలోచనలకు ప్రతిబింబం. ప్రపంచానికి ప్రాజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం అంటూ నీతులు చెప్పే అమెరికా వాటిని ఎలా కాలరాస్తోందో మేఘా, ఆమె కుటుంబంపైన విధించిన నిషేధ చర్యలు మరోసారి బట్టబయలు చేశాయి. అమెరికాలో ప్రతిష్టాత్మకమైన మస్సాచ్ సెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)లో మే 29న గ్రాడ్యుయేషన్ వేడుక సందర్భంగా జరిగింది. ఈ విద్యాలయంలో సీటు రావడం, డిగ్రీ పూర్తి చేయడం ప్రపంచంలో చాలా కొద్దిమందికి దొరికే అరుదైన అవకాశం. మన తెలుగు సంతతికి చెందిన మేఘా కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, లింగ్విస్టిక్స్ కోర్సులో డిగ్రీ పూర్తి చేసింది. ఆమె ఎంఐటిలో 2025 సంవత్సరానికి క్లాసు ప్రెసిడెంట్‌గా (మన యూనివర్సిటీల్లో ఛైర్మెన్ హెూదా) వుంది. గ్రాడ్యుయేషన్ వేడుకల్లో క్లాసు ప్రెసిడెంట్‌గా మాట్లాడే అవకాశం ఆమెకు వచ్చింది. తన భావాలను వ్యక్తం చేయడానికి ఇది సరైన సందర్భంగా ఆమె భావించింది. ఇజ్రాయిల్ దురాక్రమణకు గురవుతున్న పాలస్తీనాకు మద్దతుగా సాంప్రదాయ ఎరుపురంగు కెఫియే కండువా ధరించి 'మనం డిగ్రీలు పూర్తి చేసి భవిష్యత్‌లోకి అడుగిడుతున్న ఈ సమయంలో, గాజాలో విద్యాలయాలే లేకుండా పోయాయని' అంది. 'పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడికి మన దేశమే (అమెరికా) కాదు, మన కళాశాల కూడా అలాంటి దాడిని ప్రోత్సహించడానికి సహాయపడుతుండడం సిగ్గుగా వుంది'. ఎంఐటిలో చేస్తున్న కీలక పరిశోధనలు ఇజ్రాయిల్ దళాలకు సహాయపడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఎంఐటి పరిశోధన సంబంధాలను కలిగివున్న ఏకైక విదేశీ సైన్యం ఇజ్రాయిల్' అని చెప్పింది. యువత మేధో విజ్ఞానం పాలస్తీనా వినాశానికి సహాయపడడాన్ని ఆమె ప్రశ్నించింది. 'పాలస్తీనాను భూమి నుండి తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని' ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని నిర్భీతిగా ప్రకటించింది. 'ఉద్దేశపూర్వకంగా కార్యక్రమ సమయాన్ని, నియమాలను మేఘా ఉల్లఘించిందని' ఎంఐటి యాజమాన్యం ఆమెను, ఆమె తల్లిదండ్రులను క్యాంపస్ నుండి బహిష్కరించారు. ఆ వెంటనే మన దేశంలో లాగే అక్కడ కూడా మత, జాతి ఉన్మాద ముష్కరులు మేఘా, ఆమె కుటుంబం పైన సోషల్ మీడియాలో వికృత ట్రోలింగ్ చేశారు. మరోవైపు ప్రపంచంలోని అనేక దేశాల యువత, విద్యార్థులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. మేఘా తెలివైన విద్యార్థిని. ప్రపంచ ప్రఖ్యాత ఎంఐటి విద్యార్థి నాయకురాలు. ఆమె తాత్కాలిక ఆవేశంతో మాట్లాడిన మాటలు కావు అవి. గత కొన్ని సంవత్సరాలుగా పాలస్తీనాలో జరుగుతున్న జాతి దురహంకారం గురించి తాను వింటున్న, చూస్తున్న ఘటనలకు మేధోవంతురాలి స్పందన అది. జార్జియాలోని అల్ఫారెట్టాలో పుట్టిపెరిగిన మేఘా ప్రాథమిక విద్య అక్కడే పూర్తి చేసింది. విద్యార్థి దశలోనే జోర్డాన్‌లోని హైస్కూల్ విద్యార్థుల కోసం న్యూరోసైన్స్ పాఠ్యాంశాల కరికులమ్ రూపొందించింది. 2021లో అమెరికాలో నేషనల్ మెరిట్ అవార్డు సాధించి ఎంఐటిలో స్థానం దక్కించుకుంది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి క్లాసు ప్రెసిడెంట్‌గా ఎన్నికై చదువుతోపాటు సామాజికస్పృహలో ముందుంది. ప్రపంచాన్ని ముఖ్యంగా పాలస్తీనాలో జరుగుతున్న పరిణామాలను విజ్ఞతతో నిశితంగా పరిశీలించింది. భావాలను ధృఢపరుచుకుంది. సందర్భం వచ్చినప్పుడు స్పష్టంగా ప్రకటించింది. విద్యాలయాల్లో భిన్న దృక్పథాలు, ప్రశ్నించేతత్వం లేకుండా విజ్ఞానం వికసించదు. కళ్లెదురుగా జరుగుతున్న దుర్మార్గాలను, అన్యాయాలను, వాటి మూలాలను పరిశోధించడం, తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించడం విద్యకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలని మేఘా గుర్తించింది, ఆచరించింది. ఆ మాత్రపు ప్రశ్నను కూడా ప్రపంచంలోని అనేక దేశాధినేతలు, వారి అనుయాయులు సహించలేకపోవడం నేటి వ్యవస్థలో వున్న అతిపెద్ద బలహీనత. కొద్ది నెలల క్రితం అమెరికాలోని ప్రిన్‌టన్ యూనివర్సిటీలో పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శనలో పాల్గొన్న 110 మంది విద్యార్థులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తమిళనాడుకు చెందిన అచింతన్ శివలింగన్ అనే అమ్మారు హసన్ సయ్యద్ అనే అబ్బాయి కూడా ఉన్నారు. సామ్రాజ్యవాదం ఇంతగా నిర్బంధాలకు పాల్పడుతుందంటే దానికి ప్రతిఘటన పెరుగుతుందని స్పష్టమవుతుంది. మేఘాకు అండగా మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, కేంద్ర ప్రభుత్వంలో తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఆమెపై విధించిన నిషేధాన్ని తొలగించేందుకు తోడ్పడాలి. మహిళల హక్కుల గురించి మాట్లాడే పవన్ కల్యాణ్ ఈ ఘటనపై తక్షణం మాట్లాడుతారని ఆశిద్దాం. రాష్ట్రంలోని విద్యార్థులు, అభ్యుదయ, ప్రజాతంత్రవాదులు స్పందించి మేఘా ఎం వేమూరికి అండగా నిలుద్దాం.

# నాణ్యమైన విత్తనం..రైతన్నలకు నేస్తం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే కార్యక్రమాన్ని ముందుకు తీసుకొచ్చింది. నాణ్యమైన విత్తనాలను అందించే లక్ష్యంగా లక్ష్యంగా రైతులతో కలిసి నిర్వహించిన నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమం మిర్యాలగూడ మండల కేంద్రము లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నుముక లాంటి వారు మరి ముఖ్యంగా మన మిర్యాలగూడ నియోజకవర్గం మన దేశానికే అన్నపూర్ణ లాంటిది. నియోజకవర్గంలో వ్యవసాయం పైనే ముఖ్యంగా సాగర్ ఎడమ కాలువ ఉండటం వలన వరి సాగు పైనే ఆధారపడే రైతులు అధికంగా ఉన్నారు. రైతుకి అధిక దిగుబడి రావాలి అంటే నీరు ఎంత ముఖ్యమో సరైన విత్తనం కూడా అంటే ముఖ్యం అందుకే రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందిస్తే రైతులు మరింత లాభపడే అవకాశం ఉంటుంది కాబట్టి ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రో,,జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారిచే ఈ వినూత్న పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు కు కూడా మా రైతన్నల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. వారు అందజేస్తున్న ఈ విత్తనాలను రైతులు సాగు చేసి తదుపరి పంట ద్వారా ఉత్పత్తియైన విత్తనాన్ని తోటి రైతు సోదరులకు తక్కువ ధరకే అందజేయాలి అని అన్నారు. అలాగే జూన్ 12వ తేదీన ఏరువాక పౌర్ణమి నాడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో ప్రతీ ఒక్క రైతు నాగలి కట్టి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఖరీఫ్ పంటలకు నీటి కటకట

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పాకిస్థాన్ భారత్‌పై దూకుడుకు దిగింది కానీ, ఈ క్రమంలో కమ్ముకొస్తున్న సింధూ ముప్పును గుర్తించలేకపోయింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ ఓ వైపు సిందూర్ ఆపరేషన్‌తో పాక్‌పై విరుచుకుపడింది. దౌత్య బహిష్కరణతో పాటు అత్యంత కీలక రీతిలో సింధూ నదీజలాల ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు, ఇక ఇక్కడి నుంచి సింధూ జలాలు అటువైపు వెళ్లవని ప్రకటించింది. దీనితో సిందూర్‌తో పోలిస్తే పాకిస్థాన్‌కు ఇప్పుడు సింధూ ఎఫెక్ట్ బాగా పడింది. ఇప్పటి ఖరీఫ్ పంటల కాలానికి నాట్లు వేసుకోవడంలో చిక్కులు ఎదుర్కోనుంది. భారత్ కీలక నిర్ణయంతో సింధూ నదీ వలయంలో అవసరం అయిన జలాలు అందుబాటులోకి రావడం కష్టం కానుంది. దీనితో నాట్లు వేసుకునే పనులకు గడ్డు పరిస్థితి ఏర్పడనుంది. భారత్‌పై వ్యతిరేక చర్యలు, అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రయోజనాల రక్షణకు పాటుపడుతున్న హెహబాజ్ ప్రభుత్వం పొంచి ఉన్న పంట ముప్పును సరిగ్గా పసికట్టలేకపోతోంది. సింధూ, జీలం చెనాబ్ నదులకు ప్రవాహాలు తగ్గుముఖం పట్టాయి. దీనితో అనుసంధాన భూముల్లో పంటలకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడనుంది. తమ పలు జలాశయాలలో నీటి మట్టం తగ్గిందని ఇటీవలే పాకిస్థాన్ జల వ్యవహారాల విభాగం తెలిపింది. ఎగువన భారత్ నుంచి జలం నిలిపివేతతో క్రమేపీ పాక్‌లో ప్రవహించే నదులలో జలం లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోంది. సోమవారంతో పాకిస్థాన్ పంజాబ్ ప్రాంతంలోని సింధూ నది వ్యవస్థలో నీటి మట్టం దాదాపు 11 శాతం తగ్గుముఖం పట్టిందని అధికారికంగా ప్రకటించారు. ఖరీఫ్ పంటల నాట్లకు నీటి అవసరం ఎంతైనా కావాలి. రాబోయే రోజులలో నీటి మట్టం మరింత తగ్గితే పరిస్థితి ఏమిటనేది అధికారుల కన్నా స్థానిక ప్రజలను తీవ్రస్థాయిలో కలవరపరుస్తోంది. వాతావరణ పరిస్థితుల వల్ల పాకిస్థాన్‌కు నైరుతి రుతుపవనాలు రావడం మరో నాలుగు వారాలకు కానీ వీలుకాదు. అప్పటికైనా వర్షాల పరిస్థితి ఏమిటనేది ఆందోళనకరం అయింది. జూన్ చివరి నాటికి కానీ వర్షాలు రావు. అప్పటివరకూ నాట్ల పని అయోమయం అవుతుందని ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ పరిస్థితిని గమనించే ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంతర్జాతీయ వేదికల నుంచి తరచూ సింధూ జలాల ఒప్పందం అమలు జరిగితీరాల్సిందే అని చెపుతున్నారు. అయితే భారత్ ఏ పరిస్థితుల్లో ఒప్పందం నుంచి వైదొలిగిందనే కారణాలను ఆయన విలేకరులు ప్రశ్నించినా చెప్పలేని సంకట స్థితి ఉంది.

# పాక్ నిజస్వరూపంపై భారత పోరాటం

**వేద న్యూస్, డెస్క్:**

భారతదేశం పాకిస్థాన్ నిజ స్వరూపాన్ని ప్రపంచానికి తెలియజేయడంలో నిలకడగా, దృఢంగా వ్యవహరిస్తోందని, దీనికి బలూచ్ ప్రజలు ఎంతగానో రుణపడి ఉంటారని ప్రముఖ బలూచ్ ఉద్యమకారుడు మీర్ యార్ బలోచ్ పేర్కొన్నారు. దాదాపు 6 కోట్ల మంది బలూచ్ ప్రజలు భారతదేశానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన అన్నారు. బలూచిస్థాన్ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పలు బృందాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ కార్యకర్త, భారత్ చేస్తున్న ప్రయత్నాలను మనస్ఫూర్తిగా అభినందించారు. పాకిస్థాన్ ఉగ్రవాద వైఖరిని ఎండగట్టేందుకు భారత్ వివిధ దేశాలకు బృందాలను పంపిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ చేస్తున్న సరిహద్దు ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టేందుకు భారత అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు చేస్తున్న ప్రయత్నాల్లో బలూచిస్థాన్‌లో జరుగుతున్న మారణహోమాన్ని కూడా చేర్చాలని మీర్ యార్ బలోచ్ మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన భారత ప్రతినిధి బృందాలకు ఒక బహిరంగ లేఖ రాశారు. పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాలను అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడంలో భారత ప్రభుత్వం చూపుతున్న చొరవ, బలూచ్ ప్రజలకు నైతిక స్థైర్యాన్ని ఇస్తోందని ఆయన అన్నారు. తమ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించడంలో భారత్ పాత్ర కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. దశాబ్దాలుగా బలూచ్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి ఆకాంక్షలను భారత్ అర్థం చేసుకుని, వారికి పోరాటంలో పరోక్షంగా మద్దతు పలకడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. తమ సహజ వనరులను కొల్లగొడుతూ, తమ హక్కులను కాలరాస్తున్న పాకిస్థాన్ ప్రభుత్వ విధానాలపై బలూచ్ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇటువంటి క్లిష్ట సమయంలో భారతదేశం తమకు అండగా నిలవడం గొప్ప విషయమని ఆయన వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో కూడా పాకిస్థాన్ విషయంలో భారతదేశం ఇదే విధమైన దృఢ వైఖరిని కొనసాగించాలని తాము కోరుకుంటున్నట్లు సదరు బలూచ్ కార్యకర్త ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేదరికంలో మగ్గిపోతున్న 40 శాతంపైగా చిన్నారులు

**వేద న్యూస్, డెస్క్:**

ఈక్వెడార్‌లో 40 శాతానికిపైగా చిన్నారులు పేదరికంలో మగ్గిపోతున్నారు. జూన్ 1వ తేదీ ఈక్వెడార్ బాలల దినోత్సవం. ఈ సందర్భంగా దక్షిణ అమెరికాలోని ఈక్వెడార్‌లో ఎంతమంది చిన్నారులు పేదరికంలో మగ్గిపోతున్నారనే సమాచారాన్ని తాజాగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ సెన్సెస్ (ఇనెక్) ప్రచురించింది. ఈ ఇనెక్ తాజా డేటా ప్రకారం.. ఈక్వెడార్ ప్రభుత్వం కనీస ప్రాథమిక అవసరాలైన విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం వంటివి కూడా తీర్చకపోవడంతో 49.4 శాతం మంది పిల్లలు పేదరికంలో జీవిస్తున్నారు. వీటినిబట్టి చూస్తే.. ఆ దేశంలో కచ్చితంగా వ్యూహాత్మక ప్రజావిధానాలను అమలు చేయాలని, వాటిని ద్వారా బాల్యాన్ని సురక్షితంగా కాపాడుకోగలమని ఈ సమాచారం తెలియజేస్తోందని ఇనెక్ డేటా తెలిపింది. కాగా, 2025 నాటికి ఈక్వెడార్‌లో 3.5 మిలియన్ల చిన్నారులు ఉంటే అందులో 1.8 మిలియన్లు బాలురు, 1.7 మిలియన్ల మంది బాలికలు పేదరికంలో ఉంటారని గతంలోనే అంచనావేయబడింది. ఇక దేశంలో 2.2 మిలియన్లకు పైగా కుటుంబాల్లో ఒక బిడ్డకు అయినా సరైన పోషకాహారం లభించదని అంచనా వేయడం జరిగింది. ఇప్పుడు రెండు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో 19.3 శాతం మంది పిల్లలు పోషకాహర లోపంతో బాధపడుతున్నారని తాజా ఇనెక్ నివేదిక వెల్లడించింది. ఆర్థిక అసమానతల వల్ల దేశంలో సగం శాతం మంది చిన్నారులు కనీస అవసరాలు తీరక పేదరికంలో ఉంటే.. మరోవైపు సగం శాతం మంది చిన్నారులు ఇంటర్నెట్, మొబైల్ వాడకంలో చురుకుగా ఉన్నారని ఇనెక్ డేటా తెలిపింది. సుమారుగా 52.5 శాతం ఇంటర్నెట్, 48.8 శాతం మొబైల్ ఫోన్, 25 శాతం కంప్యూటర్, 10 శాతం ట్యాబ్స్ ఉపయోగిస్తున్నారని ఇనెక్ తెలిపింది.



వేద న్యూస్

బుధవారం జూన్ 4, 2025

మందకృష్ణ మాదిగ.. ఈ పేరు తెలియని వారు ఉండరు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తన కులంలో పుట్టిన వారి కోసం, వెనుకబడిన జాతి కోసం ధర్మ యుద్ధం మొదలు పెట్టిన వ్యక్తి.. తన జాతి కోసం జీవితాన్ని ధారపోస్తున్న లీడర్.. పేరు చివరి మూడు అక్షరాలతో తన సామాజిక వర్గానికి ఆత్మగౌరవాన్ని సమకూర్చిన ఉద్యమ నాయకుడు ఆయన. అణగారిన వర్గాల్లోనూ అసమానతలున్నాయంటూ ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చి.. ఆయన చేసిన వర్గీకరణ పోరాటం మందకృష్ణను ప్రజల్లో నిలిపింది. సాదాసీదా కుటుంబం నుంచి వచ్చిన ఆయన.. పట్టుదలకు మారుపేరుగా నిలిచి.. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా తన పంథా మార్చుకోకుండా ఎత్తిన జెండా దించకుండా.. మొండి ధైర్యంతో చేసిన పోరాటం ఆయనకు.. ఇంతటి గొప్ప గుర్తింపు రావడానికి దోహదం చేసింది. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగకు దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీని ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగపై ‘వేద న్యూస్’ తెలుగు దినపత్రిక అందిస్తున్న స్పెషల్ స్టోరీ..







### ఆత్మగౌరవపతాక మందకృష్ణ

మందకృష్ణ మాదిగ..వరంగల్ జిల్లా హంటర్ రోడ్డు న్యూశాయంపేటలో చిన్నకొమరయ్య, కొమరమ్మ దంపతులకు 1965లో జన్మించారు. మందకృష్ణ వాళ్ల తల్లితండ్రులకు పదో సంతానం. పేరెంట్స్ ఆయనకు పెట్టిన పేరు ఏలియా.. కాగా, తర్వాత ఎల్లయ్యగా మార్చారు. ఆ తర్వాత శాస్త్రి, శర్మ, రెడ్డి, రావు, నాయుడు, చౌదరి లాంటి కుల సూచక పదాలకు మాత్రమే గౌరవమర్యాదలు లభిస్తున్న సమాజంలో, అప్పటి దాకా అవమానంగా ఉపయోగిస్తూ వచ్చిన మాదిగ అనే పదాన్ని తన పేరు పక్కన మాదిగ చేర్చుకుని మందకృష్ణ మాదిగ గా సామాజిక చైతన్యానికి ప్రతీకగా, ఆత్మగౌరవపతాకగా నిలిచారు. తన జాతికి న్యాయం జరగాలి, రాజ్యాంగం కల్పించిన హక్కులు అనుభవించాలి అంటే ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందే అని 1994 జూలై 7న పాతిక మంది యువకులతో ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మందకృష్ణ మాదిగ పునాదులు వేశారు.



### ఈదుముడిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం

బీసీలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ వల్లే ఎవరి వాటా వారు అనుభవించగలుగుతున్నారు. వర్గీకరణతో బీసీల్లో చీలిక రానప్పుడు, ఎస్సీల్లో వర్గీకరణ జరిగితే కూడా ఎలాంటి చీలికలు జరగవని షెడ్యూల్డ్ కులాల్లో మాదిగల కంటే వెనుకబడిన వారు కూడా ఉన్నారు. రెల్లి, పైడి, పాకితో పాటు చాలా ఉపకులాలు రిజర్వేషన్ ఫలాలు ఏ మాత్రం పొందడం లేదు. వాళ్లను ఏం చేయాలి.. రిజర్వేషన్ల పంపిణీలో మొదటి ముద్ద వాళ్లకు దక్కాలి అంటే బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే రిజర్వేషన్లు సాధ్యమవుతాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణ పేదల ప్రయోజనాల కోసం 1994 జూలై 7న పాతిక మంది యువకులతో ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మందకృష్ణ మాదిగ పునాదులు వేశారు. అలా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం జరిగింది.

# ఉద్యమాల ‘కృష్ణ’కు ‘పద్మశ్రీ’

## జాతి కోసం జీవితం అంకితం

30 ఏండ్లకుపైగా వర్గీకరణ కోసం పోరాటం


ఎన్నో మానవీయ ఉద్యమాలు.. అన్యాయానికి ఎదురు నిలిచిన నేత

ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగకు దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం

### ఉద్యమనేతకు అత్యున్నత అవార్డు

- భారత రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ల ఫలాలు ఏ కులము, వర్గం ఏకపక్షంగా అనుభవించడానికి వీల్లేదు. అలా జరిగితే వాటి సాధనకు అర్థమే లేదు. కాబట్టి
- రాజ్యాంగం ప్రకారం అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నది మంద కృష్ణ మాదిగ ఆశయం. అందుకోసమే సుమారు 30 ఏండ్లుగా మంద కృష్ణ నిర్విరామంగా ప్రజా ఉద్యమాలు నిర్మిస్తున్నారు.
- ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చేసిన మానవీయ ఉద్యమాలు, పట్టుదలకు పద్మశ్రీ అవార్డు వరించిందని చెప్పొచ్చు.





వేద న్యూస్, కృష్ణ :




### మందకృష్ణ ఉద్యమాల ఫలితం ‘ఆరోగ్యశ్రీ’

దండోరా ఉద్యమం మాదిగ కులాల కేంద్రంగా ప్రారంభమైనప్పటి మానవీయ కోణంలో, కుల మతాలకు అతీతంగా సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా, అసమానతలకు, నిరాదరణకు గురైన వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, చిన్న పిల్లల గుండె ఆపరేషన్ ఉద్యమాలకు మాతృకగా నిలిచి.. అస్తిత్వ లేదా గుర్తింపు రాజకీయాల పరిధిని దాటి పోరాటాలను నిర్మించడం ద్వారా ఒక కొత్త ఒరవడిని ఆదర్శాలను ప్రజా ఉద్యమాలకు అందించింది. బాధిత సమూహాలకు రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడానికి కారణమైంది. గుండె జబ్బులతో బాధపడుతున్న పేద పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా ఆపరేషన్ చేయించాలని 2004లో మందకృష్ణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. నాటి ఉద్యమం ఫలితమే అంతిమంగా ‘ఆరోగ్య శ్రీ’ పథకానికి దారితీసింది. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని వర్గాల పేద ప్రజలు ఆ స్కీమ్ కింద వైద్య సేవలు అందుకుంటున్నారంటే కారణం మందకృష్ణ మాదిగే అని చెప్పుకోవచ్చు.



### రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఘనత..

2014 ఎన్నికల ముందు సమాజంలోని బుక్కడు బువ్వకు నోచుకోకుండా అర్ధాకలితో అలమటిస్తున్న వృద్ధులను చూసి చలించిపోయిన మందకృష్ణ వృద్ధులు, వితంతువులు, వికలాంగుల కోసం మరో సామాజిక ఉద్యమాన్ని మొదలుపెట్టారు. అన్ని రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులకు రూ.వెయ్యి, వికలాంగులకు రూ.1,500 పెన్షన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ వేదికపైన ఉన్న రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అమలు చేస్తున్న పరిస్థితిని చూస్తూనే ఉన్నాం. ఒక మాదిగ సామాజిక వర్గమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల పేదలు పింఛన్లు పొందుతున్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073